

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

విలేకరులు కావలెను
తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువతీ యువకులకు జర్నలిస్టుగా పనిచేసేందుకు సదావకాశం
న్యూస్ వార్ దిన పత్రిక
నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో
వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.
94409 91979

నల్లగొండ | epaper.news war.com | మంగళవారం 26, మే 2026 | సంపుటి :16 సంచిక :58 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00



# 'ద్రవ్యోల్బణ సూత్రధారి' నరేంద్రమోదీ



ప్రజల జేబులను
నిశ్శబ్దంగా ఖాళీ చేస్తున్నారు
ఈ ధరల పెంపు ఇక్కడితో ఆగదు
పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో
సామాన్యులు తీవ్ర ఇబ్బందులు
ఇంధన ధరల పెంపు.. ప్రధానిపై
రాహుల్ గాంధీ ధ్వజం

పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను విడతల వారీగా పెంచుతూ ప్రజలపై పెనుభారం మోపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆయన ఓ పోస్టు పెట్టారు. ప్రధాని మోదీని ఉద్దేశించి 'ద్రవ్యోల్బణ సూత్రధారి' అంటూ విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలను నెమ్మదిగా పెంచుతూ ప్రజల జేబులను నిశ్శబ్దంగా ఖాళీ చేస్తున్నారని ఆరోపించారు.



## కేంద్రం సహకరించకున్నా
# ధాన్యం కొనుగోలు చేస్తున్నాం

ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చింద
ముఖ్యమంత్రికి సీపీఐ నాయకులు ధన్యవాదాలు
సీఎం రేవంత్‌రెడ్డి

కేంద్రప్రభుత్వం సహకరించకపోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సీపీఐ బృందం ఈరోజు (సోమవారం) సచివాలయంలో సమావేశం అయ్యారు.

వార్త 2లో



## హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థిక రుణం.. ఐఆర్‌ఎఫ్‌సీతో కీలక ఒప్పందం

హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌తో (ఐఆర్‌ఎఫ్‌సీ) హైదరాబాద్ మెట్రో కీలక రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి సంబంధించిన ఈ ఒప్పందంపై ఈరోజు (సోమవారం) ఢిల్లీలో సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సమక్షంలో ఈ ఒప్పంద ప్రక్రియ పూర్తయింది. హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చే కీలక అడుగుగా ఈ ఒప్పందాన్ని అధికారులు అభివర్ణించారు.

2

## బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే
# ప్రతిఇంటికి తాగునీరు అందిస్తాం: కేటీఆర్



2

కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ )పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆరే అని.. హైదరాబాద్‌లో 24 గంటల తాగునీరు ఇచ్చేది కూడా కేసీఆరే అని వెల్లడించారు.

## కేంద్ర ప్రభుత్వ దుర్మార్గమైన విధానాలతో
# రైతాంగం కష్టాల్లో ఉన్నారు: మంత్రి తుమ్మల



2

దేశంలో అన్నిరకాల పంటలను తమ ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (వీఱఅఱర్‌వతీ ఱష్ట్రబఎఝ్రుశ్రీఝ చీఝస్త్రవంఝుతీఝ =ఝుశీ) వ్యాఖ్యానించారు. వరిధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు సిగ్గులేకుండా బీజేపీ నేతలు బస్సుయాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కనీసం గన్నీ బ్యాగులు తీసుకురాలేని పరిస్థితి ఉందని అన్నారు. కేంద్రప్రభుత్వ దుర్మార్గమైన విధానాల కారణంగానే రైతాంగం కష్టాల్లో ఉన్నారని తెలిపారు.

## భూదాన్ భూముల వ్యవహారం.. ఈడీ విచారణకు ఐపీఎస్ అధికారి

2




## హైకోర్టు న్యాయవాది హత్య కేసు.. వెలుగులోకి సంచలన విషయాలు..

2



న్యూస్ వార్
వార్తా పత్రిక

**సంపాదకీయం...**

# యువత డిజిటల్ ఉద్యమ సునామీ

**దేశ రాజకీయ ముఖచిత్రంలో ఊహించని సరికొత్త పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. డిజిటల్ వేదికగా యువత బొద్దింకల జనతా పార్టీ (కాక్రోచ్ జనతా పార్టీ), జాతీయ పరాన్నజీవుల కూటమి (నేషనల్ పారసైటిక్ ఫ్రంట్) పేర్లతో సృష్టించిన రెండు కొత్త శక్తులు సంచలనం కలిగిస్తున్నాయి. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, వ్యవస్థాగత అవినీతికి నిరసనగా భారతీయ జెన్‌జెడ్ సోషల్ మీడియా వినియోగదారులు సృష్టించిన వ్యంగ్య ఆన్‌లైన్ రాజకీయ ఉద్యమాలివి. ఇవి కేవలం మీమ్స్‌కే పరిమితం కాకుండా యువత ఆక్రోశాన్ని ప్రతిబింబించే సామూహిక డిజిటల్ నిరసనగా రూపాంతరం చెందాయి. ఈ రెండింటికీ ఎన్నికల సంఘం గుర్తింపు లేకపోయినా ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలకు చెమటలు పుట్టిస్తున్నాయి. ఇందులో బొద్దింకల జనతా పార్టీ అసాధారణ డిజిటల్ ఉద్యమం వెనుక ఉజ్వలమైన ఆత్మగౌరవ పోరాటం ప్రజ్వలిస్తోంది.**

ఒక కోర్టు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు నిరుద్యోగ యువతకు తీవ్ర మనస్తాపం కలిగించాయి. నిరుద్యోగ యువత వ్యవస్థపై దాడిచేసే బొద్దింకలని, సమాజాన్ని పట్టిపీడించే పరాన్నజీవులని, సోమరులని, హేళనతో కూడిన ఆ వ్యాఖ్యలకు యువత భగ్గుమంది. దేశవ్యాప్తంగా తిరుగుబాటు జెండా ఎగురవేసే డిజిటల్ రాజకీయ సునామీకి తెరలేపింది. దీంతో సిజెఐ ఆ మరునాడే నాలిక్కర్చుకుని తన వ్యాఖ్యలను తప్పుగా చిత్రీకరించారన్నారు. నకిలీ డిగ్రీలతో న్యాయవాద వృత్తిని భ్రష్టుపట్టిస్తున్న కొందరు నకిలీ న్యాయవాదులను ఉద్దేశించి మాత్రమే వ్యాఖ్యలు చేసినట్టు వివరణ ఇచ్చారు. స్వయం కృషీవలుడు మా గోపాలుడు! అయినా యువత ఆగ్రహం చల్లారడం లేదు. మమ్మల్ని బొద్దింకలు, పరాన్నజీవులు, సోమరిపోతులంటారా? ఆ పేర్లతోనే కదం తొక్కుతామని యువత డిజిటల్ ఉద్యమం చేపట్టారు. ఈ నేపథ్యంలోనే మే 16న కాక్రోచ్ జనతా పార్టీ పుట్టింది. బోస్టన్ యూనివర్శిటీలో పబ్లిక్ రిలేషన్స్ చదువుతున్న, గతంలో ఆప్ సోషల్ మీడియా వాలంటీర్‌గా పనిచేసిన 30 ఏళ్ల యువకుడు అభిజీత్ దీప్కే ఈ వినూత్న పార్టీని స్థాపించారు. ఈ పార్టీ తమ నినాదంగా సెక్యులర్, సోషలిస్ట్, డెమోక్రటిక్, లేజీ (సోమరి) అని ప్రకటించుకుంది. నిత్యం ఆన్‌లైన్‌లో ఉంటూ సోమరిపోతులుగా ముద్రపడి, ఇటీవల బొద్దింకలు అని పిలవబడ్డ యువత కోసమే ఈ పార్టీ అంటూ వ్యంగ్యంగా తన మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ పార్టీ పెట్టిన కేవలం 48 గంటల్లోనే సొంతంగా వెబ్‌సైట్, పార్టీ గీతాన్ని కూడా విడుదల చేయడం గమనార్హం. మే 20 నాటికి కాక్రోచ్ జనతా పార్టీకి ఎక్స్ ఖాతాలో 60లక్షల వరకు ఫాలోవర్లు పెరిగారంటే ఉద్యమం ఎంత ఊపులో ఉందో తెలుస్తుంది. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన మహువా మొయిత్రా, కీర్తి అజాద్ వంటి ప్రముఖ పార్లమెంటేరియన్లు దీనికి గట్టి మద్దతు ఇస్తున్నారు. ఈ నిరసన ఉద్యమం డిజిటల్ స్క్రీన్లను దాటి వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెట్టింది. దేశ రాజధాని ఢిల్లీలో వందలాది మంది యువ వాలంటీర్లు బొద్దింకల వేషధారణతో కాలుష్యమయమైన యమునా నదిని స్వచ్ఛందంగా శుభ్రం చేస్తూ శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. సుప్రీం, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు రిటైరైన తరువాత వారికి ప్రభుత్వ పదవులు ఇవ్వరాదని, ఫిరాయింపుల నిరోధక చట్టం అమలు చేయాలని, చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలని, అక్రమ మీడియా సంస్థల లైసెన్సు రద్దు చేయాలని తదితర ఐదు ప్రధాన డిమాండ్లతో మేనిఫెస్టో విడుదల చేసింది. కాక్రోచ్ జనతా పార్టీకి సమాంతరంగా ఏర్పడిన నేషనల్ పారాసైటిక్ ఫ్రంట్ ప్రభుత్వ వైఫల్యాలను, లోపభూయిష్టమైన వ్యవస్థలను ఎండగట్టడమే తమ ప్రధాన లక్షంగా విప్లవాత్మక అసంబద్ధత అనే సరికొత్త ప్రచార శైలిని అనుసరిస్తోంది. పన్నులు కడుతూ కనీస సదుపాయాలు పొందలేకపోతున్న సాధారణ పౌరులు ఈ వ్యవస్థలో బాధితులుగా బతుకుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తోంది. బహుముఖ ప్రజ్ఞాశాలి యువత ఆకాంక్షలకు అనుగుణంగా కొన్ని డిమాండ్లను తెరపైకి తీసుకు వస్తోంది. నేరచరిత్ర లేని స్వచ్ఛమైన పార్లమెంట్ ఏర్పాటు కావాలని, దేశంలో మెరుగైన శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించడం, సామాన్యులకు నమ్మకమైన ప్రజా రవాణా, విద్యుత్ వంటి వినియోగ సేవలను తక్కువ ధరకు అందించాలని, వీరు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. మొత్తం మీద ఈ రెండు డిజిటల్ ఉద్యమాలు తమకు మద్దతుగా కొన్ని లక్షల ఫాలోవర్లను చేర్చుకోగలుగుతున్నాయి. ఇది కేవలం నవ్వులాటకో, మీమ్స్ కోసమో పెట్టిన పార్టీ కాదని, కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేస్తోంది. దేశంలో హాట్‌టాపిక్‌గా మారిన నీట్ పేపర్ లీకేజీ అంశంపై కాక్రోచ్ జనతా తీవ్రంగా స్పందించింది. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. సిబిఎస్ఇ రీచెకింగ్ ఫీజులను రద్దు చేయాలని కోరుతోంది. యువత సమస్యలపై గళం పెంచుతోంది. భారత యువత అత్యంత అవగాహనతో ఉన్నారని, తమపై జరిగే అపహాస్యాన్ని, తమ అసంతృప్తిని హింసాత్మక మార్గాల్లో కాకుండా అత్యంత ప్రజాస్వామ్యబద్ధంగా, వ్యంగ్యంగా ప్రపంచానికి చాటి చెబుతున్నారని, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. డిజిటల్ సునామీ సృష్టిస్తున్న ఈ యువకులంతా తాము కేవలం సోషల్ మీడియాలో మాట్లాడే వాళ్లు మాత్రమే కాదని, నిర్మాణాత్మక విమర్శల ద్వారా దేశంలో నిజమైన మార్పును కోరుకునే బాధ్యతాయుతమైన పౌరులమని నిరూపించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా జెన్‌జెడ్ యువత ఆకాంక్షలకు తగ్గట్టు వారి సమస్యలను పరిష్కరించలేకుంటే ఈమీమ్ పాలిటిక్స్ భవిష్యత్‌లో అసలైన ఎన్నికల రాజకీయాలను శాసించినా ఆశ్చర్యపోనక్కరలేదు.




# ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత

### ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

### ఆరోగ్యమే మనకు అసలు సిసిలు సంపద


### యోగా, ధ్యానం, ప్రాణాయామం జీవితంలో భాగం కావాలి

### ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని

### కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో చంద్రబాబు

**చిత్తూరు,**

ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధ శాల. ఈ మాట నేను ఎప్పుడూ చెబుతాను. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. శనివారం చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అదృష్టవంతులని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సిఎం వివరించారు. 'రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి 'సంజీవని' అని పేరు పెట్టాం. సంపద కంటే ఆరోగ్యమే గొప్పది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఒక ఏఐ డాక్టర్ ఉంటారని తెలిపారు. సంజీవని పథకం విస్తరణలో భాగంగా డబ్బు, హోదా, కార్లు ఎన్ని ఉన్నా.. అన్నింటికీ మించింది ఆరోగ్యమేనని గుర్తు చేశారు. సంజీవని పథకం కింద ఇంటి నుంచే 74 రకాల వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశముందన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే ఎఐ డాక్టర్ ద్వారా కూడా వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒక ఎఐ డాక్టర్ ఉంటాడని స్పష్టం చేశారు. వైద్య ఖర్చుల భారం నుంచి కుటుంబాలను గట్టెక్కించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది వైద్యరంగానికి రూ.19,305 కోట్లు కేటాయించామని, 15వ ఆర్థిక సంఘం నుంచి దేశంలోనే అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు సాధించామని గుర్తు చేశారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల విలువైన వైద్యం, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటామని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సిఎం చంద్రబాబు అన్నారు. సమర్థ నీటి నిర్వహణతో భూగర్భ జలాలను పెంచగలిగామని, దీనికి అన్నమయ్య జిల్లానే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలతో అక్కడ భూగర్భ జలాలు 8.5 మీటర్లు పెరిగి, పచ్చదనం పెరిగిందన్నారు. రాష్ట్రమంతా తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే, అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయని, పిడుగురాళ్లలో 49 డిగ్రీలు నమోదైతే, అన్నమయ్యలో 40 డిగ్రీలే ఉందని నివేదికలను ఉటంకించారు. సాగునీటి ప్రాజెక్టులపై సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో క్యాలెండర్ విడుదల చేశామని చంద్రబాబు తెలిపారు. నీవా పనులు పూర్తి చేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తెస్తామని, కల్యాణి డ్యాంకు కూడా నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు-నగరి, మల్లెమడుగు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ప్రాజెక్టుల పూర్తికి గడువులను ప్రకటించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.




## ధాన్యం కొనుగోళ్లపై రైతుల ధర్నా

### శాంతియుత ధర్నా చేస్తున్నా అరెస్ట్ చేస్తే ఎలా

### ప్రభుత్వంపై మండిపడ్డ గజ్వేల్ బిఆర్ఎస్ నేత వంటేరు

**మెదక్,**

రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తే పోలీసులు బలవంతంగా అరెస్టు చేస్తున్నారని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి ఆరోపించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. వారికి మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు. పోలీసులు దౌర్జన్యంగా రైతులను అరెస్టు చేసి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు గన్నీ బస్తాలు, లారీలు లేకపోవడంతో వడ్లు కల్లాల్లోనే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు దౌర్జన్యంగా ధర్నా చేయకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## బెంగుళూరులో కాక్రోచ్ జనతా పార్టీ

### నేడు మానవహారం అంటూ వెలసిన పోస్టర్లు

### అలాంటిదేమీ లేదంటూ పోలీసుల కొట్టివేత

**బెంగళూరు,**

సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో మే 24న బెంగళూరులో మానవహారం నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'బొద్దింకల జనతా పార్టీ కర్ణాటక' పేరుతో విడుదలైన పోస్టర్‌లో టౌన్ హాల్ సమీపంలో శాంతియుత మానవహారం చేపడతామని పేర్కొన్నారు. 'బొద్దింకల శక్తి ఆన్‌లైన్‌లోనే కాదు, వీధుల్లో కూడా ఉంది' అని పోస్టర్‌లో పేర్కొనడం చర్చనీయాంశమైంది. అయితే ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని బెంగళూరు పోలీసులు స్పష్టం చేశారు. మానవహారం నిర్వహించేందుకు ఏ వ్యక్తి, సంస్థ లేదా రాజకీయ పార్టీ నుంచి ఇప్పటివరకు దరఖాస్తు రాలేదని తెలిపారు. టౌన్ హాల్ పరిసరాల్లో అనుమతి లేకుండా గుమికూడవద్దని, సోషల్ మీడియాలో ఈ కార్యక్రమానికి సంబంధించిన సందేశాలను షేర్ చేయవద్దని హెచ్చరించారు. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోలుస్తూ ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై వ్యంగ్యంగా స్పందిస్తూ 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభమైంది. ఈ పేరుతో ప్రారంభమైన ఎక్స్ ఖాతా కొద్ది రోజుల్లోనే వైరల్‌గా మారింది. అనంతరం ఆ ఖాతా నిలిపివేయబడినప్పటికీ, ఇన్‌స్టాగ్రామ్‌లో సీజేపీకి భారీ స్థాయిలో ఆదరణ లభించింది. కొద్ది రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా 1.85 కోట్ల ఫాలోవర్లను సంపాదించి, ప్రధాన రాజకీయ పార్టీల అధికారిక పేజీలను అధిగమించింది. పుణెకు చెందిన అభిజీత్ దీప్కే అనే యువకుడు ఈ ఖాతాను ప్రారంభించారు. ఖాతా నిలిపివేసిన తరువాత తనకు ప్రాణహాని బెదిరింపులు వస్తున్నాయని ఆయన తెలిపారు.

## మక్కరైతుల బొక్కబోర్లా

### కొనుగోళ్లు లేక నానా తంటాలు

**నిజామాబాద్,**

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో మక్కలు, జొన్న రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జరగాల్సిన కొనుగోళ్లు ముందుకు కదలడం లేదు. అనుమతులు రాకపోవడంతో కొనుగోళ్ల పక్రియనే చేపట్టలేదు. మే 20 నుంచి జొన్న కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసింది. ఇప్పటికే మార్కెట్ యార్డుల్లో నెలల తరబడి పంట ఉత్పత్తులతో రైతులు పడిగాపులు కాస్తూ వేచి చూస్తున్నారు. మక్క రైతుల పరిస్థితి దయనీయంగానే చేరింది. కొనుగోళ్లు తూతూ మంత్రంగా చేపట్టి చేతులు ఎత్తేశారు. రూ.2400 కనీస మద్దతు ధర అన్నది ఎక్కడా అమలు కావడం లేదు. మక్క రైతులు బాధలకు ప్రభుత్వం స్పందించడం లేదు. మార్క్‌ఫెడ్ అధికార యంత్రాంగం చేతులు ఎత్తేసినట్లే కనిపిస్తోంది. కొనుగోళ్ల విషయంపై మౌనం పాటిస్తోంది. ప్రైవేటు కొనుగోళ్లు మినహాయించగా 8లక్షల 65వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 6లక్షల 29వేల 915 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 739 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.అన్ని చోట్ల కేంద్రాలను తెరిచారు. ప్రస్తుతం 653 చోట్ల కొనుగోళు



కొనసాగుతున్నాయి. 86 చోట్ల కొనుగోళ్లు పూర్తయ్యాయి. కామారెడ్డి జిల్లాలో 5లక్షల 11వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించేందుకు టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 3లక్షల 14వేల 589 మెట్రిక్ టన్నులు సేకరించారు. 42వేల 225 మంది రైతుల నుంచి రూ.751.55 కోట్లు చెల్లింపులు పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 414 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించారు. అన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా 329 కేంద్రాల్లో ప్రస్తుతం కొనుగోళ్లు జరుగుతున్నాయి. 67 చోట్ల కొనుగోళ్లు పూర్తి కావడంతో మూసేశారు. ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం తప్ప కొనుగోళ్లు జరగక రైతులు కల్లాలవద్దనే పడిగాపులు పడుతున్నారు. కొన్నిచోట్ల ధాన్యం తూకం వేసి మూడు రోజులైనా, లారీలు వస్తలేవని సంచులు తీసుకుని పోవడం లేదు. తూకం వేసిన బస్తాలు ఎండల్లోనే ఎండిపోతున్నాయి. డ్రైవర్లకు రూ.2 ఇస్తేనే లారీలు వస్తాయని చెబితే దానికీ ఒప్పుకున్న రైతులు అందుకు కూడా సరే అంటున్నారు.. అయినా లారీలు వస్తలేవని అంటున్నారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

# ప్రైవేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజులను అరికట్టాలి

## జిల్లా కలెక్టర్, డిఈఓ, ఎంఈఓ , ఇంటర్ విద్యాశాఖ అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలి

**చౌటుప్పల్ మే 25 (న్యూస్ వార్)**

రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు మరియు విద్యాసంస్థల్లో పెరుగుతున్న అధిక ఫీజుల సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ నేడు పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు పిల్లల చదువుల కోసం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, విద్య అనేది సామాన్య ప్రజలకు భారంగా మారకూడదని, బోడె రామచంద్ర యాదవ్ నిర్ణయాత్మక కార్యాచరణలో భాగంగా బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థలు చేస్తున్న దోపిడిని అరికట్టుటకు ఉద్యమించిందని ఆ పార్టీ పిఏసి మెంబర్ డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, బిల్డింగ్ ఫీజులు, బస్సు ఫీజులు, పుస్తకాల పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. సాధారణ ప్రజలు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని ప్రభుత్వం వెంటనే గుర్తించాలని కోరారు. జిల్లా కలెక్టర్లు, డిఇఓ , ఎంఈఓ మరియు ఇంటర్ విద్యాశాఖ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రతి జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పనిచేయాల్సిన కొన్ని విద్యాసంస్థలు కేవలం లాభాపేక్షతో వ్యవహరిస్తున్నాయని. బీసీవై పార్టీ తరుపున ఆరోపించారు విద్యను సేవగా చూడకుండా వ్యాపారంగా మార్చడం సమాజానికి ప్రమాదకరమని, విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరిగే విధంగా ఫీజుల కోసం వేధింపులు చేయడం, పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం వంటి చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల గౌరవం మరియు భవిష్యత్తు కాపాడటం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని పేర్కొన్నారు.అలాగే ప్రభుత్వం రూపొందించిన ఆర్టీఈ చట్టం ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం సీట్లను పారదర్శకంగా అమలు చేయాలని బీసీవై పార్టీ తెలంగాణ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మరియు ఉపాధ్యాయుల సమస్యలపై బీసీవై పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని తెలిపారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు కూడా చేపట్టి ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.“విద్యను కాపాడితేనే సమాజ భవిష్యత్తు బలపడుతుంది” అని అయన అన్నారు. ఈ సందర్భంగా బిసివై పార్టీ తెలంగాణ తరఫున ప్రభుత్వం మరియు అధికారులకు క్రింది డిమాండ్లు తెలియజేయడం జరిగింది: ముఖ్య డిమాండ్లు:రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను వెంటనే అరికట్టాలి.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి ఫీజుల నియంత్రణపై పర్యవేక్షణ చేయాలి. డిఇఓ , ఎంఈఓ మరియు ఇంటర్ విద్యాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి.ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు నిబంధనలు అతిక్రమించిన విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి.విద్యార్థులను ఫీజుల పేరుతో వేధించే యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఆర్టీఈ చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25% సీట్లు పారదర్శకంగా అమలు చేయాలి.తల్లిదండ్రుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చలి.విద్యార్థుల భద్రత, పరిశుభ్రత మరియు నాణ్యమైన విద్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.ఉపాధ్యాయులకు సరైన గౌరవం, వేతనాలు మరియు ఉద్యోగ భద్రత కల్పించే చర్యలు తీసుకోవాలి.ప్రతి విద్యాసంస్థ ప్రభుత్వం జారీ చేసిన నియమాలు, మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలి. అనే బి సి వై తెలంగాణ పార్టీ తరఫున ఈ డిమాండ్లను తెలియజేశారు.

# విధులను బహిష్కరించిన చౌటుప్పల్ బార్ అసోసియేషన్

**చౌటుప్పల్ మే 25 (న్యూస్ వార్ )**

చౌటుప్పల బార్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్ న్యాయవాది హత్యకు నిరసనగా చౌటుప్పల్ కోర్టులో విధులను బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలియచేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్ మాట్లాడుతూ హైదరాబాదులో ప్రత్యర్థులు న్యాయవాది ఖాజా మొయిజుద్దిన్ పై జరిపిన దారుణమైన దాడి మరియు హత్యను తీవ్రంగా ఖండిస్తూ. ఈ చర్యకు బాధ్యులైన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దుండగులు న్యాయవాది హత్యకు పాల్పడక ముందే బెదిరింపు దాడులు చేసినప్పటికీ పోలీసులు హత్యకు గురైన న్యాయవాదికి సరైన భద్రత అందించలేదని ఇది విచారకరమని మరణించిన న్యాయవాది కుటుంబ సభ్యులకు ప్రభుత్వము తగినంత భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. న్యాయవాద రక్షణ చట్టం అమలులోకి వచ్చినప్పటికీ న్యాయవాదులపై దాడులు కొనసాగుతున్నాయని, వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి చౌటుప్పల్ బార అసోసియేషన్ ప్రగాఢమైన సానుభూతి తెలియజేసింది. ఈ




కార్యక్రమంలో భారసోసియేషన్ ఉపాధ్యక్షులు పిట్టల భిక్షమయ్య, సహాయ కార్యదర్శి మక్తల నరసింహ, కల్చరల్ సెక్రటరీ దేశగోని శ్రీశైలం, కార్యవర్గ సభ్యులు ఏం.డి ఖయ్యూం పాషా, పి. కిరణ్, మాజీ అధ్యక్షులు బాల్యం వెంకట చలపతి న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, తడక మోహన్, రాపోలు వేణు, జల్లా రమేష్, జక్కర్తి శేఖర్, నాగరాజు, రవీందర్, రాఘవేంద్ర,శంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంప్ సర్టిఫికెట్లు సాధించిన మర్రిగూడ పీఎం శ్రీ మోడల్ స్కూల్ విద్యార్థులు

**మర్రిగూడ మే 25 (న్యూస్ వార్)**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీఎం శ్రీ మోడల్ స్కూల్ సమ్మర్ క్యాంప్ ఈరోజుతో ఘనంగా ముగిసింది. విద్యార్థులలో సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు నిర్వహించిన ఈ క్యాంప్ విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంది. ఈ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు యోగ, డాన్స్, మ్యూజిక్, చిత్రలేఖనం, ఆటలు, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ బేసిక్స్ వంటి అంశాలతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కల్పించారు. క్యాంప్ మొత్తం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటూ తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి శారద మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు జీవన నైపుణ్యాలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు. సమ్మర్ క్యాంప్‌ల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. అతిథిగా పాల్గొన్న పీఎం శ్రీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉయ్యాల వెంకటేశం మాట్లాడుతూ, సెలవులను సద్వినియోగం చేసుకుని కొత్త విషయాలు నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. క్యాంప్ ముగింపు




సందర్భంగా పాల్గొన్న విద్యార్థులందరికీ సమ్మర్ క్యాంప్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ రూప్ సింగ్, ఉపాధ్యాయులు స్వప్న, కర్నాటి శ్రీహరి, శంకర్, సత్యనారాయణ, యాదయ్య, కొండల్, సీఆర్పీలు బిచ్చయ్య నాయక్, చంద్రయ్య, కృష్ణతోపాటు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అల్లందేవిచెర్వు గ్రామంలో పల్లె దవాఖాన ప్రారంభోత్సవం

**నారాయణపురం మే 25 (న్యూస్ వార్)**

మండలంలోని అల్లందేవిచెరువు గ్రామంలో గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ ఆధ్వర్యంలో పల్లె దవాఖాన ప్రారంభోత్సవ కార్యక్రమం ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రవీనా సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామంలో ఉన్న పల్లె దవాఖానకు డాక్టర్ కావాలని మేము కోరిన కొద్ది రోజుల్లోనే గ్రామంలోని పల్లె దవాఖానకు డాక్టర్ శారదను వైద్యురాలిగా నియమించిన వైద్యశాఖ అధికారులకు గ్రామ సర్పంచ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుర్వి సౌజన్య రాజుగౌడ్ మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గ్రామంలో బెల్ట్ షాపులను నిషేధించినందుకు గుర్తింపుగా కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈభవనం గతంలో గ్రామపంచాయతీ కార్యాలయంగా వినియోగించబడేదని, కానీ నూతన గ్రామపంచాయతీ నిర్మించుకున్న తదనంతరం ఖాళీగా ఉన్న ఈ భవనాన్ని పల్లె దవాఖానాకు కేటాయించి ఈరోజు ప్రారంభించుకోవడం జరిగిందని గ్రామ సర్పంచ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముక్యేర్ల కవితా స్వామి యాదవ్, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మచారి,వార్డు సభ్యులు వంటల సువర్ణ, గణేష్ యాదవ్, సుర్వి వినోద్ గౌడ్, గుండు లింగస్వామి గౌడ్, అంతటి శివశంకర్ గౌడ్, గోధుమగడ్డ భవాని లింగారెడ్డి, ఏఎన్ఎం ఆండాలు,ఆశా వర్కర్లు సుర్వి లావణ్య,డి.సరిత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు



సుర్వి అలివేలు, అంతటి సురేష్ గౌడ్, సుర్వి రవి గౌడ్,సుర్వి కృష్ణ గౌడ్ అంతటి అంజయ్య గౌడ్ సుర్వి నరసింహ గౌడ్ అంతటి అంజయ్య గౌడ్ సురవి రామాంజనేయులు గౌడ్ గుండు జంగయ్య గౌడ్,సుర్వి వెంకటేష్ గౌడ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# లోపాలు సరిదిద్దడంలో అధికారులు ఫెయిల్

## నీట్–యూజీ పేపర్ లీకేజీపై ‘సుప్రీం’ ఆగ్రహం

దేశంలో లక్షలాది మంది వైద్య విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీటి–యూజీ ప్రవేశ పరీక్ష సేపర్ లీకేజీ వ్యవహారంపై సుప్రీంకోర్టు మరో సారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్షల నిర్వహణలో జరుగుతున్న వరుస లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం.. గతంలో అన్ని వివాదాలు జరిగినా.. సంబంధిత ఖధి కారులు ఇంకా పాఠాలు నేర్చుకో లేదా? అని కామెంట్ చేసింది. దేశంలో పరీక్షలను పారదర్శకంగా నిర్వ హించాల్సిన శేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విద్యా శాఖల వైఫల్యాలపై దాఖలైన సిటిషన్లను సుప్రీంకోర్టు ఆవాళ వివా రించింది. లక్షలాది మంది విద్యార్థులు సగలు, రాత్రి కష్టపడి చదివి పరీక్షలు రాస్తుంటే.. షేపర్ లీక్లలు, గ్రేస్ మార్కు అక్రమాల వల్ల వారి నమ్మకం దెబ్బ తింటోందని కోర్టు పేర్కొంది. వ్య స్థలో ఉన్న లోపాలను సరిదిద్దడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నా రని మండిపడింది.

**తప్పు కప్పిపుచ్చుకోడం సరికాదు**

ఓ పరీక్ష పవిత్రత దెబ్బత్ న్నప్పుడు, దానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకో వాల్సిందేనని కోర్టు స్పష్టం చేసింది. ఎక్కడో ఒకచోట తప్పు జరిగింద తెలిసినప్పుడు, దానిని కప్పిపుచ్చడానికి ప్రయ త్నించడం సరికాదని పేర్కొం ది. ఈ మొత్తం వ్యవబోరంలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయి నివేదిక సమర్పించా అని, తదుపరి చర్యలపై సృష్టత ఇవ్వాలని ఎస్టీటీఏ, కేంద్ర ప్రభత్యానికి కోర్టు ఆదేశాలు జాదే చేసింది. దేశ వ్యాప్తంగా విద్యా ర్థులు, తల్లిదండ్రులు రోడ్లపైకి వచ్చి నిరసనలు కలుపుతున్న తరుణంలో సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు అధికారుల్లో వణు కు పుట్టిస్తున్నాయి.



Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,